క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఇబ్రహీంపట్నం: మండలంలోని 33కేవీ ఫీడర్లలో మరమ్మతులు చేపడుతున్నందున ఇబ్రహీంపట్నం, వర్షకొండ, ఎర్దండి సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలతోపాటు మెడిపల్లి వెస్ట్ సబ్ స్టేషన్‌లో గల అమ్మక్కపేట, మేడిపల్లి, బండలింగాపూర్, మెట్లచిట్టాపూర్ గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీష్ గురువారం తెలిపారు.

చల్‌గల్, ఒడ్డెరకాలనీల్లో..

జగిత్యాలరూరల్: అంతర్గాం ఒడ్డెరకాలనీ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దొంతి శ్రీధర్ తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని చల్‌గల్, ఒడ్డెరకాలనీ గ్రామాల్లో ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

రాయికల్: పట్టణంలోని 11వ వార్డులో డ్రైయినేజీ, తాగునీరు, సీసీ రోడ్ల సమస్య తీవ్రంగా ఉందని, పరిష్కరించాలని కోరుతూ గురు వారం కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. నాయకులు రమేశ్, దామో దర్, స్వప్న, సంజయ్, సత్యనారాయణ, అఖిల పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఈఈ నారాయణరెడ్డి

రాయికల్: పట్టణంలోని ఉర్దూ మీడియం, ఒడ్డెరకాలనీ, ఇందిరానగర్‌కాలనీలో ప్రభుత్వ ఆదర్శ పాఠశాల పనులను గురువారం ఈఈ నారాయణరెడ్డి పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన పెండింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట డీఈ భాస్కర్, ఏఈ వినయ్‌కుమార్ ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న విప్ అడ్లూరి

పెగడపల్లి: ల్యాగలమర్రి గ్రామానికి చెందిన గుర్రాల లక్ష్మీకి రూ.1.30లక్షల విలువైన ఎల్‌వోసీని గురువారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అందజేశారు. అనారోగ్యంతో బాధ పడుతూ మెరుగైన వైద్యం కోసం అడ్లూరిని కలిసి ఆర్థిక సాయం కోరారు. లక్ష్మణ్‌కుమార్ చొరవ మేరకు నిమ్స్‌లో మెరుగైన వైద్యమందేలా ప్రభుత్వం నుంచి మంజూరైన ఎల్‌వోసీని హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.

స్టాక్ రికార్డుల్లో నమోదు చేయాలి



ఇబ్రహీంపట్నంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏవో దీపిక

ఇబ్రహీంపట్నం: ఎరువుల దుకాణాల యజమానులు ఎప్పటికప్పుడు స్టాక్‌ను రిజిస్టర్లలో నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారి దీపిక సూచించారు. గురువారం ఇబ్రహీంపట్నం, అమ్మక్కపేట గ్రామాల్లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లో విత్తనాలు, ఎరువుల నిలువలను రిజిస్టర్‌లో నమోదు ఏవిధంగా చేశారో పరిశీలించారు. ప్రతి దుకాణంలో బోర్డుల్లో స్టాక్ నిలువలు, ధరలను నమోదు చేయాలన్నారు. అధిక ధరలకు విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. ఏఈవో నరేశ్, ఆగ్రోస్ సంస్థ యజమాని ఆమెటి కృష్ణ పాల్గొన్నారు.

ఆలయ భూమి సాగుకు వేలం

జగిత్యాలరూరల్: పొలాస శివారులోని శ్రీపొలాస్తేశ్వరస్వామి దేవాలయానికి చెందిన వ్యవసాయ భూమిని సంవత్సర కాలంపాటు పంట సాగు చేసుకునేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో రవికిషన్ గురువారం తెలిపారు. దేవాలయానికి చెందిన సర్వే నంబరు 342/1లో 7.18 ఎకరాలు, సర్వే నంబరు 359 నుంచి 368 వరకు 18.30 ఎకరాల భూమికి శుక్రవారం ఉదయం 10 గంటలకు దేవాలయ ఆవరణలో వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు 7.18 ఎకరాలకు రూ.50వేలు, 18.30 ఎకరాల భూమికి రూ.25వేల ధరావత్ చెల్లించి పాల్గొనాలని సూచించారు.

దారులన్నీ ప్రమాదకరంగానే..

- మలుపుల వద్ద రక్షణ చర్యలు కరువు
- ప్రయాణికులకు తప్పని తిప్పలు



సూచికల్లేని మద్దునూర్ ఘాట్ రోడ్డు



గోపులాపూర్ సమీపంలో రహదారి పక్కనే పిచ్చిమొక్కలతో కనబడకుండా ఉన్న గొయ్యి

బుగ్గారం: ఒకప్పుడు నియోజకవర్గ కేంద్రంగా ఉన్నా.. ప్రస్తుతం మండల కేంద్రంగా ఏర్పడినా.. బుగ్గారం మండలం ఇంకా వెనకబడే ఉంది. ముఖ్యంగా ప్రధాన రహదారిని అభివృద్ధి చేస్తే ఈ మండలంలో ఆశించిన మార్పులు రావడానికి అవకాశాలున్నాయి. జాతీయ రహదారి 63 నుంచి 7వ నంబరు రాష్ట్ర రహదారి వరకు గల ఈ ప్రధాన రహదారి మండల కేంద్రం గుండా వెళ్తూ పలు గ్రామాలను అనుసంధానం చేస్తుంది. ఇంత ప్రధానమైన రహదారి పరిస్థితి అధ్వానంగా తయారైంది. పలుచోట్ల ప్రమాదకరమైన మలుపులు, గుంతలతో వాహనదారులకు తీవ్ర అసౌకర్యంగా మారింది.

సూచికల్లేని మలుపులు

మండలంలోని వివిధ గ్రామాలను కలిపే ప్రధాన బీటీ రహదారిపై అనేక చోట్ల ప్రమాదకర మలుపులున్నాయి. బుగ్గారం ఎక్స్ రోడ్డు సమీపం నుంచి ధర్మపురి మండలం రాయపట్నం వరకు గల బీటీ రోడ్డుపై సుమారు పదికి పైగా ప్రమాదకర మలుపులున్నాయి. వీటిపై ఎలాంటి సూచికలు లేకపోవడంతో వాహనదారులకు ప్రమాదకరంగా పరిణమించాయి. ముఖ్యంగా రాత్రిపూట ప్రయాణించేవారు ఏమాత్రం ఆదమరిచినా అదుపుతప్పి ప్రమాదాల బారిన పడడం ఖాయం. అంతేకాకుండా రోడ్డుకిరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి సైడ్‌బర్మ్‌ల స్థలాన్ని పూర్తిగా ఆక్రమించడంతో తారు రోడ్డుకు పక్కన ఏమాత్రం ఖాళీ స్థలం లేదు. దీంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చేటప్పుడు వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. సింగిల్ లేన్‌గా ఉన్న రహదారి కావడంతో భారీ వాహనాలు ప్రయాణించేటప్పుడు కార్లు, బైకులు నడిపేవారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తోంది. గతంలో అనేక ప్రమాదాలు కూడా జరిగాయి. బీర్‌సాని గ్రామానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి బైకుపై నుంచి కింద పడిపోయి ప్రాణాలు కోల్పోయాడు. స్థానికంగా పని చేస్తున్న ఓ పోలీస్ కానిస్టేబుల్ బుగ్గారం శివారులో ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి ప్రమాదం బారిన పడి గాయాలపాలయ్యాడు. ఇలాంటివి ఎన్నో దుర్ఘటనలున్నాయి.

ప్రమాదకరంగా ఘాట్ రోడ్డు

మండలంలోని మద్దునూర్ గ్రామానికి వెళ్లే రహదారి అనేక చోట్ల శిథిలమై వాహనదారులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. గ్రామ శివారులో మద్దునూర్ గండి ప్రాంతంలో గల గుట్ట బోరుపై నుంచి వేసిన ఘాట్ రోడ్డుకు సైడ్‌బర్మ్ స్థానంలో ఎలాంటి రక్షణ చర్యలు కూడా చేపట్టలేదు. ఇదే రహదారిపై గతంలో లక్షెట్టిపేటకు చెందిన ఓ ప్రయాణికుడు రహదారి పక్కన గల కల్వర్టులో పడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ప్రాంతంలో గల ఘాట్ రోడ్డుపై మరిన్ని ప్రమాదాలు జరగకముందే తగిన రక్షణ చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు ప్రజలూ కోరుతున్నారు. గ్రామ శివారులోని ఓ వాగుపై గల వంతెన కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఈ మార్గం గుండా ప్రయాణించే వివిధ గ్రామాల ప్రజలు తిప్పలు పడుతున్నారు. ఏళ్ల క్రితం కట్టిన వంతెన కావడంతో వర్షాకాలం వాగులో నీరు అధికంగా ప్రవహించేటప్పుడు ఆధారభాగంలోని బండ రాళ్లు తొలగిపోతుండడంతో పైభాగంలోని ఉపరితలంలో గొయ్యి ఏర్పడింది. బండ రాళ్లు తేలి వాహనాలు ప్రయాణించడానికి అసౌకర్యంగా మారింది. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు ఇదే మార్గంలో ఓ చోట గల రహదారి కోతకు గురైంది.

అనేక గ్రామాలకు..

ఈ మార్గం గుండా బుగ్గారం మండలం గోపులాపూర్, బీర్‌సాని, సిరికొండ, శెకల్ల గ్రామాలతోపాటు పక్క మండలాలైన వెల్గటూర్, గొల్లపల్లి, ధర్మపురి మండలంలోని అనేక గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన శిథిలావస్థకు చేరడంతో రాత్రి ప్రయాణించే వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశముంది. గ్రామ శివారులోని పొలాలకు వెళ్లే రైతులు తమ ఎడ్లబండ్ల ద్వారా వెళ్లేటప్పుడు వంతెనపై తేలిన పెద్ద పెద్ద బండ రాళ్లతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పశువుల కాళ్లు బండ రాళ్లపై జారుతుండడంతో.. ఎడ్లబండ్ల ద్వారా సరుకులు, ధాన్యం రవాణా చేసేటప్పుడు ఇబ్బంది పడుతున్నారు. వంతెన మధ్యలో ఏర్పడిన గొయ్యితో ప్రమాదాలు జరిగే ఆస్కారముంది.

ఉన్నతాధికారులకు నివేదించాం



నూతన వంతెన నిర్మాణం గురించి ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కానీ ఇంతవరకు ఎలాంటి పురోగతి చర్యలు లేవు. అనేక గ్రామాలకు ఇది ప్రధాన రహదారి మార్గం. ప్రజల సౌకర్యార్థం అధికారులు వెంటనే స్పందించి నూతన వంతెన నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలి.

– రాయిళ్ల రవికుమార్, మద్దునూర్

రెయిలింగ్ ఏర్పాటు చేయాలి



మద్దునూర్ గ్రామ శివారు ప్రాంతంలోని గండి ప్రాంతంలో గల రహదారిపై ఎలాంటి ప్రమాదాలు జరగకముందే రెయిలింగ్ ఏర్పాటు చేయాలి. నిత్యం వందలాది వాహనదారులు ఈ మార్గంలో రాత్రి, పగలు వెళ్తుంటారు. అధికారులు వెంటనే స్పందించి తగిన రక్షణ చర్యలు తీసుకోవాలి.

– పంచిత లక్ష్మణ్, సిరికొండ

కోరం లేక సమావేశం వాయిదా



సభ్యుల కోసం ఎదురుచూస్తున్న అధికారులు

ధర్మపురి: మండల ప్రాదేశిక సభ్యుల కోరం లేకపోవడంతో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ధర్మపురి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు చెందిన ఎంపీటీసీలకు సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో రవీందర్ వారం రోజుల క్రితమే సమాచారమందించారు. గ్రామాభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషిస్తున్న ఎంపీటీసీలు హాజరు కాకపోవడం పలు విమర్శల కు తావిస్తోంది. గతంలో సమావేశానికి హాజరు కా ని సభ్యులకు నోటీసులు జారీ చేసిన సంఘటనలున్నాయి. వచ్చే నెల జులై 4 నాటికి ఎంపీటీసీ పదవీ కాలం ముగుస్తుంది. చివరి సమావేశమైనా.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వివరించడానికి ముఖ్యులుగా ఉన్న సభ్యులు గైర్హాజరు కావడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ చిట్టిబాబు తెలిపారు. ప్రాదేశిక సభ్యులతోపాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పూర్తిస్థాయిలో రాకపోవడంతో ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించాల్సిన సమావేశానికి మధ్యాహ్నం ఒంటి గంట అవుతున్నా సభ్యులు, అధికారులు హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సొల్ల నరేశ్, వివిధ శాఖల అధికారులు తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకున్న 2004–07 పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాటి అధ్యాపకులు క్యాతం వెంకన్న, దొనె తిరుపతి, వీరేశంలను సన్మానించారు. ఆటపాటలతో ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు.

రైతన్న పంట పండింది..



పెగడపల్లిలో ధాన్యం రాశులు(ఫైల్)

పెగడపల్లి: మండలంలో ఈ యాసంగి సీజన్‌లో వరి పంట రైతులను సిరివంతులను చేసింది. వానాకాలంలో వాతావరణం అనుకూలించక సక్రమంగా పంట పండలేదు. ఈ యాసంగిలో ఎస్సారెస్పీ నీటి విడుదల కావడం, దీనికి తోడుగా అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను సద్వినియోగం చేసుకొని మండలంలో సుమారు 26వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. రైతుల ఆశలు వమ్ము కాకుండా వరి పంట కూడా బాగా సాగయింది. మండలంలో ఏర్పాటు చేసినా 31 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పుష్కలంగా ధాన్యం వచ్చి చేరింది. అంచనాలకు మించి దిగుబడులు వచ్చి రైతులకు సిరులు కురిపించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంత ఎక్కువగా పంటలు ఎప్పుడు పండలేదని సంతోషంగా ఉన్నారు.

ఆర్థిక పరిస్థితులను అధిగమించి..

రైతులు ఆర్థిక పరిస్థితులను అధిగమించి మరీ వరి పంటలను సాగు చేశారు. నీటి వనరులు అందుబాటులో ఉండి వరి ధాన్యం దిగుబడి బాగా రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 23 గ్రామాల్లో 26వేల ఎకరాల్లో వరి పంటలను సాగు చేశారు. సుమారు 2.50లక్షల క్వింటాళ్ల మేరకు ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. అధికారులు, రైతుల అంచనాలను మించి యాసంగిలో ఎకరాకు 28 నుంచి 35 క్వింటాళ్ల వరకు ధాన్యం దిగుబడి రావడంతో.. ఎక్కడ చూసినా ధాన్యం రాశులతో కొనుగోలు కేంద్రాలు కళకళలాడాయి. మండలంలోని కొనుగోలు కేంద్రాలు ధాన్యం రాశులు, ధాన్యం బస్తాలతో నిండుగా కనిపించాయి. నెల రోజుల వ్యవధిలో వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 3.42లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. ఎస్సారెస్పీ, వ్యవసాయ బావుల ఆధారంగా వరి సాగు విస్తీర్ణం పెరిగింది. ఈసారి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోళ్లు సాగడంతో రైతులు హర్షిస్తున్నారు.

నేడు పెగడపల్లి మండల సమావేశం

పెగడపల్లి: మండల పరిషత్ సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు ఎంపీపీ శోభ అధ్యక్షతన జరిగే సమావేశానికి సభ్యులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

వివాహిత అదృశ్యం

మల్లాపూర్: ముత్యంపేటకు చెందిన మతిస్థిమితం లేని చిట్యాల లక్ష్మి(55) అనే వివాహిత అదృశ్యం కావడంతో గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. లక్ష్మి 10 రోజుల కిత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులకు ఆమె జాడ లభించలేదు. భర్త చిట్యాల నర్సయ్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కథలాపూర్: కథలాపూర్ శివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ గురువారం తెలిపారు. పెట్రోలింగ్ చేస్తుండగా కనిపించడంతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

‘డబ్బులు పంచి ఓట్లు దండుకున్నారు’



మాట్లాడుతున్న కృష్ణారావు

కోరుట్లరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బులు పంపిణీ చేయక పోవటంతో ఓడిపోయానని చెప్పుకున్న ఎంపీ ధర్మపురి అరవింద్ పార్లమెంట్ ఎన్నికల్లో డబ్బులు పంపిణీ చేసి గెలుపొందాడని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణంలోని జువ్వాడి భవన్‌లో మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బీజేపీ అభ్యర్థికి ఓట్లు వేయించారని అన్నారు. జీవన్‌రెడ్డి లాంటి సీనియర్ నాయకుడు ఎంపీగా గెలిచి ఉంటే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందేదన్నారు. మండల అధ్యక్షుడు కొంతం రాజం, బ్లాక్ అధ్యక్షుడు పెరుమండ్ల సత్యనారాయణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్, కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి శంకర్, కేడీసీసీ మాజీ డైరెక్టర్ గంగాధర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ముగ్గురికి నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ

రాయికల్: పట్టణానికి చెందిన చెవులమద్ది శివకుమార్, మహ్మద్ నబీ, మూటపల్లి గ్రామానికి చెందిన మార్గం సాయికుమార్‌లకు కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసినట్లు ఎస్సై అజయ్ గురువారం తెలిపారు. ఈ ముగ్గురు వేర్వేరు కేసుల్లో కొంతకాలంగా కోర్టు ట్రయల్‌కు హాజరు కాకుండా తప్పించుకుతిరుగుతున్నారని, దీంతో కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసినట్లు వివరించారు.

ఉత్సవాలకు రావాలని ‘పొన్నం’కు ఆహ్వానం

మెట్‌పల్లి: పట్టణంలో ఈనెల 7 నుంచి జరిగే రేణుకా ఎల్లమ్మ బోనాల ఉత్సవాలకు హాజరు కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను స్థానిక గౌడ సంఘం నాయకులు గురువారం హైదరాబాద్‌లో కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. మాజీ కౌన్సిలర్ పూదరి శ్యాం, నాయకులు చెర్లపల్లి ఆనంద్, పూదరి రాము తదితరులున్నారు.

పనులు జరగాలి.. మార్పు కనిపించాలి



మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి: అధికారులు అంకితభావంతో పని చేయాలని, సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఎంపీపీ దొనకంటి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశమై రైతులకు మేలైన విత్తనాలు అందేలా చూడాలని అన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని, ఇప్పటికే కుడి, ఎడమ కాలువలకు సర్వే పూర్తి చేశామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. మహిళలను కుట్లు, కుటీర పరిశ్రమల వైపు ప్రోత్సహించాలని అన్నారు. గోవిందరం గ్రామంలో విద్యుత్ షాక్‌తో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని, కంచెలు ఏర్పాటు చేయాలని, బాధితులకు నష్ట పరిహారమందించాలని సభ్యులు అధికారులకు సూచించారు. జనుము విత్తనాలు అందించలేదని భీమారం ప్యాక్స్ అధ్యక్షుడు కానుగంటి శ్రీనివాస్ తెలపగా.. త్వరలోనే అందిస్తామని ఇన్‌చార్జి ఏవో చంద్రదీపక్ తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ వొద్దినేని హరిచరణ్‌రావు, వైస్ ఎంపీపీ దొంతి శ్రీనివాస్, ఎంపీటీసీలు నాయిని మమత, సుధవేని లత, నెల్లుట్ల పూర్ణిమ, పన్నాల లావణ్య, అంకం వినోద, మ్యాదరి లక్ష్మి, పల్లి అర్జున్, ఆదే రాజన్న, ప్యాక్స్ చైర్మన్ మిట్టపెల్లి రమేశ్‌రెడ్డి, కో–ఆప్షన్ ఎస్‌కే హైమద్, తహసీల్దార్ వసంత, రవికిరణ్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి

బుగ్గారం: బుగ్గారం గ్రామ పంచాయతీలో భారీగా నిధుల దుర్వినియోగం జరిగిందని, ఈ విషయమై ఎన్ని విచారణలు చేసినా ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటివరకు బాధ్యులపై ఎటువంటి చర్యలు లేనందున లోకాయుక్తలో మరోసారి ఫిర్యాదు చేసినట్లు బుగ్గారం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త, సీనియర్ జర్నలిస్టు చుక్క గంగారెడ్డి తెలిపారు. జీపీ నిధుల దుర్వినియోగంపై ఎంతోకాలంగా పోరాటం చేస్తున్నా.. ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో బాధ్యులపై చర్యలు చేపట్టడం లేదన్నారు. రాజకీయ ఒత్తిళ్లు, అవినీతి, అక్రమాల వల్లే ఇలా జరిగిందని భావిస్తూ మరోసారి లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రూ.కోటికి పైగా..

బుగ్గారం సర్పంచ్ మూల సుమలత–శ్రీనివాస్ రూ.కోటికి పైగా గ్రామ పంచాయతీ నిధులను దుర్వినియోగం చేశారని గంగారెడ్డి ఆరోపించారు. అనేక అభివృద్ధి పనుల్లో అక్రమాలు, అవకతవకలు జరిగాయన్నారు. ఈ నిధుల దుర్వినియోగంలో పంచాయతీ కార్యదర్శులు మహబూబ్‌పాషా, నరేందర్, ఎంపీవో అఫ్జల్‌మియా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వివేక్ తదితరులున్నట్లు ఆరోపించారు. ఎంపీవో అఫ్జల్‌మియా పంచాయతీ ఆపరేటర్ జీతం విషయాన్ని సాకుగా చూపి రూ.22లక్షలకు పైగా నిధులను తన ఖాతాల్లోకి మళ్లించుకున్నాడని ఆరోపించారు.

ఊరూరా బడిబాట ర్యాలీలు.. ప్రచారం



జగిత్యాలరూరల్: ధరూర్‌లో ర్యాలీని ప్రారంభించిన ఎంపీడీవో విజయలక్ష్మి

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ కార్యక్రమాన్ని ఎంపీడీవో విజయలక్ష్మి ప్రారంభించారు. జగిత్యాల రూరల్ మండలంలోని అన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జాబితాపూర్ అంగన్‌వాడీ కేంద్రం బడిబాటను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి ప్రారంభించారు.

ధర్మపురి: గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బడిబాటపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతిజ్ఞ చేశారు.

మల్యాల: ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆదర్శ పాఠశాలల చైర్మన్, సభ్యులతోపాటు స్థానికులతో కలిసి గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు.

కథలాపూర్: భూషణరావుపేట, దూలూర్, తాండ్యాల గ్రామాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో ఆనందరావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం మారంపెల్లి అర్జున్, పాఠశాలల హెచ్‌ఎంలు రాజయ్య, స్వామి, పరమేశ్వర్, విష్ణు, శ్రీనివాస్‌రెడ్డి, సాయిదివ్య, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

సారంగాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య అందుతుందని ఎంఈవో వాసం భీమయ్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అన్నారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. మచ్చ శంకర్, గోవర్ధన్ ప్రసాద్, జోగినపల్లి రవీందర్‌రావు, ఆనందం, శ్రీనివాస్‌రావు, శ్రీధర్, రాంజయాకర్, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోరుట్లరూరల్: ఉపాధ్యాయులు, గ్రామైక్య సంఘాల మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు గ్రామాల్లో కుల సంఘాల పెద్దలను కలిసి బడి బయట పిల్లలను బడికి పంపాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ మాజీ డైరెక్టర్ గుగ్గిళ్ల సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మపురిలో విద్యార్థులను బడిలో చేర్చుకుంటున్న ఉపాధ్యాయులు

రాయికల్: గ్రామాల్లో ర్యాలీ నిర్వహించిన అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యనందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని ఎంఈవో భీమయ్య కోరారు. మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రభుత్వ టీచర్లు, వీవో, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: వర్షకొండ గ్రామంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు పొనకంటి వెంకట్, నాయకుడు తుక్కరాం, మాజీ ఉప సర్పంచ్ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి రాకేశ్ పాల్గొన్నారు.

పెగడపల్లి: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్ కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి పంచాయతీల్లో సమావేశాలు నిర్వహించారు.

బుగ్గారం: మండల కేంద్రంలో స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ర్యాలీ చేపట్టారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విశేష అనుభవం కలిగిన టీచర్లున్నారన్నారు. ఏపీపీ చైర్మన్లు జోగినపెల్లి సరిత, పెద్దనవేణి మనీషా, ఏపీఎం మోహనదాస్, గ్రామ కార్యదర్శి అక్బర్, సీఆర్‌పీలు పురుషోత్తం, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

కథలాపూర్: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్‌గౌడ్ కోరారు. కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని, ప్రవేశాల కోసం డొనేషన్లు వసూలు చేస్తున్న సంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. అనుమతుల్లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు.